సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం ◆ 9 ◆ జూలై ◆ 2024



మహానేతకు ఘన నివాళి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దివంగత ముఖ్య మంత్రి వైఎస్సార్ జయంతి నిర్వహించారు.

వివరాలు 9లో ▸



వైభవంగా హోమాలు

నాగర్‌కర్నూల్‌లో విశ్వశాంతి మహోత్సవం లో భాగంగా హోమాలు నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
28.4 /23.2

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రాజెక్టుల ప్రగతి మారేనా..?

- ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష
- పాలమూరు యూనివర్సిటీ సందర్శన
- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులపై భారీ ఆశలు

నేడు పాలమూరుకు సీఎం రేవంత్ రాక



కోయిల్‌సాగర్ ఎడమ కాల్వలో సిల్టు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో పర్యటించనున్నారు. పాలమూరు యూనివర్సిటీని సందర్శించి రూ.42.40 కోట్ల ఖర్చుతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు రూ.13.44 కోట్ల విలువైన మరిన్ని పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితర కీలకమైన అంశాలు, ఉమ్మడి జిల్లా ప్రగతిపై సమీక్షించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, గట్టు, తుమ్మిళ్ల తదితర సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో పురోగతిపై ఆశలు నెలకొన్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, పనుల వేగవంతానికి అవసరమైన చర్యలు తీసుకుంటారన్న అంచనాలు నెలకొన్నాయి.

నిధుల కొరతే ప్రధాన అడ్డంకి..

నడిగడ్డలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు నిధుల కొరతే ప్రధాన అడ్డంకిగా మారింది. నిధులు విడుదల చేస్తే నిరాటంకంగా పనులు పూర్తయి రెండేళ్లలో నెట్టెంపాడు, గట్టు, తుమ్మిళ్ల ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఫలితంగా కొత్తగా నడిగడ్డలో 90 వేల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వచ్చి నీరు పారనుండగా, ఆర్డీఎస్ పరిధిలోని మిగిలిపోయిన చివరి ఆయకట్టు 30 వేల ఎకరాలకు సైతం నీరు పారనుంది.

'పాలమూరు' పరుగులు పెట్టేనా?

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 12.50 లక్షల ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 2015లో తొలుత రూ.35,200 కోట్ల వ్యయ అంచనాలతో మొదలైన ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలోనే అంచనా వ్యయం రూ.52,056 కోట్లకు పెరిగింది. ప్రాజెక్టు కింద పంపుహౌస్‌లు, రిజర్వాయర్లు, టన్నెళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి కాగా, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ చానళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అన్ని చోట్ల కీలకమైన మోటార్ల బిగింపు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటివరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మొదటి లిఫ్టు వద్ద ఒక్క మోటారును మాత్రమే అధికారులు ప్రారంభించారు. నార్లాపూర్ సమీపంలో మొదటి లిఫ్టు వద్ద రెండు మోటార్లు, ఏదుల సమీపంలో రెండో లిఫ్టు వద్ద నాలుగు మోటార్లు, వట్టెం సమీపంలో మూడో లిఫ్టు వద్ద నాలుగు మోటార్ల చొప్పున బిగించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇప్పటికే నిర్మించిన కాల్వల్లోనూ నిర్వహణ లేక జమ్ము, చెత్త మొక్కలతో నిండి నీటిప్రవాహానికి అడ్డంకిగా మారింది. కేఎల్ఐ పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించేందుకు కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం ఏడాదికి రూ.200 కోట్ల వరకు నిధులు అవసరం కానున్నాయి. కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక కొడంగల్ –నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులకు సంబంధించిన సర్వే మూడు దశల్లో పూర్తికాగా, ప్రాజెక్టు డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది.



నార్లాపూర్ వద్ద పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు టన్నెల్ పనులు

నెట్టెంపాడులో 90 శాతం పనులు పూర్తి..

గద్వాల, అలంపూర్ పరిధిలోని 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు 2006లో చేపట్టిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు 90శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు ఈప్రాజెక్టు కింద 1.42 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. మిగిలిన 58 వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా 99బీ ప్యాకేజీ కింద 9,500 ఎకరాలు, 99సీ ప్యాకేజీ కింద 5,700 ఎకరాలు, 99డీ ప్యాకేజీ కింద 7,800 ఎకరాలు, 100 ప్యాకేజీ కింద 35,000 ఎకరాలకు సంబంధించిన పనులు చేయాల్సి ఉండగా 14 ఏళ్లుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు పూర్తిచేయాలంటే రూ.231.36కోట్లు అవసరం.



నెట్టెంపాడు ప్రాజెక్టు 100 ప్యాకేజీ కింద అసంపూర్తిగా ఉన్న కాల్వ నిర్మాణ పనులు

కొనసాగుతున్న తుమ్మిళ్ల పనులు


గత ప్రభుత్వ హయాంలో ఆర్డీఎస్ ప్రాజెక్టులో భాగంగా తుంగభద్ర నది నుంచి నీటిని ఎత్తిపోసి 87,500 ఎకరాలకు నీరందించేలా రూ.1197.77 కోట్లతో ఎనిమిదేళ్ల కింద తుమ్మిళ్ల లిఫ్టును చేపట్టారు. ఇందులో రూ.629.26 కోట్ల పనులు పూర్తికాగా, మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

సీఎం పర్యటన షెడ్యూల్..

మధ్యాహ్నం 12 గంటలకు	బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు.
12.45 గంటలకు	మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు.
12.45 - ఒంటి గంట వరకు	జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతారు. ఉమ్మడి జిల్లా ప్రముఖులతో భేటీ
ఒంటి గంటకు	మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవం, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
1.15 - 4.45 గంటల వరకు	జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం
5.00 - 5.45 గంటల వరకు	భూత్పూర్ రోడ్‌లోని ఏఎస్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం..
6.00 గంటలకు	మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

నత్తనడకన సంగంబండ

2004లో జలయజ్ఞం భీమా ఫేజ్–1, ఫేజ్–2లకు రూ.1,426 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు నత్తనడకగా సాగడంతో పాటు ఖర్చు పెరగడంతో 2017లో తిరిగి తెలంగాణ ప్రభుత్వం రూ.2,500 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎల్–1, ఎల్–2 పనులు పూర్తి చేశారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్‌ల కింద కాల్వ పనులు పూర్తి కావడంతో 1.10 లక్షల ఎకరాలకు వీటి ద్వారా సాగునీరు అందుతుంది. ఈ రెండు రిజర్వాయర్ల కింద దాదాపు 90 శాతం పనులు పూర్తి కాగా.. పొలాలకు నీరందించే పిల్లకాల్వలు అసంపూర్తిగా ఉండడంతో మెయిన్ కాల్వ ద్వారానే చెరువులు నింపుతున్నారు.



సంగంబండ రిజర్వాయర్

గట్టు లిఫ్టుకు రూ.285.19 కోట్లు అవసరం

రెండేళ్ల కిందట రూ.581 కోట్లతో చేపట్టిన గట్టు ఎత్తిపోతల పథకం కింద కేటీ దొడ్డి, గట్టు మండలాల్లో కొత్తగా 33 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద 40 శాతం పనులు పూర్తికాగా మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. 40 శాతం పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.204.96కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులు కొనసాగుతుండగా ప్రస్తుతం రూ.285.19 కోట్లు అవసరమున్నట్లు అధికారులు నివేదిక పంపారు.

అర్ధాంతరంగా నిలిచిన కోయిల్‌సాగర్..

కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు, డిస్ట్రిబ్యూషన్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇంకా సుమారు రూ.89.9 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల కింద నాగిరెడ్డిపల్లి పంప్‌హౌస్ వద్ద రూ.19.68 కోట్లు, తీలేరు పంప్‌హౌస్ వద్ద రూ.19.62 కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కోయిల్‌సాగర్ బ్యాక్‌వాటర్ నుంచి తవ్విన దేవరకద్ర గ్రావిటీ కెనాల్ చౌదరిపల్లి నుంచి లక్ష్మింపల్లి వరకు రూ.21 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కాల్వల కింద, గ్రావిటీ కెనాల్ పరిధిలో, ఎడమ కాల్వ పొడిగింపు పనులకు సేకరించిన భూములకు సంబంధించి ఇంకా 347 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది..



న్యూస్‌రీల్

పోలీసు ప్రజావాణికి 14 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీసు ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇందులో తగు న్యాయం చేయాలని 6 ఫిర్యాదులు, భూమి పంచాయతీకి 6 ఫిర్యాదులు, 2 భార్యాభర్తల మధ్య గొడవ ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో అచ్చంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తొలి సమావేశం నిర్వహించారు. కమిషనర్ శ్యాంసుందర్ మున్సిపల్ అధికారులు, సిబ్బందిని పరిచయం చేస్తూ.. వారి విధులను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. అన్ని కాలనీల సమస్యలను పరిష్కరించాలని, పట్టణ ప్రజలకు సేవలందించాలన్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందరి సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు.

హాజరు కాని బీఆర్ఎస్ కౌన్సిలర్లు...

మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం, ఎన్నిక సందర్భంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు కౌన్సిలర్లు పాల్గొనని విషయం తెలిసిందే. కాగా తాజాగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ ఐదుగురు కౌన్సిలర్లతో పాటు మరి కొందరు హాజరు కాలేదు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లకు కార్యాలయం నుంచి ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ సమావేశానికి హాజరు కాలేదని తెలిసింది. కార్యక్రమంలో కమిషనర్ శ్యాంసుందర్, మేనేజర్ అనిత, వైస్‌చైర్‌పర్సన్ శైలజ, గౌరీశంకర్, సోమ్లానాయక్, లావణ్య, రమేష్, నూరిభేగం, చిట్టెమ్మ, సుగుణమ్మ, సునీత, సంధ్య, శ్రీనివాసులు, సిబ్బంది హేమలత, మనోజ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో నల్లమల విద్యార్థి ప్రతిభ

అచ్చంపేట రూరల్: రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 7న పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నల్లమల విద్యార్థి ప్రతిభ చాటాడు. పట్టణంలోని ఎక్సలెంట్ గ్రామర్ హైస్కూల్(ఎంఎస్ఎన్)లో చదువుతున్న విద్యార్థి శివరామకృష్ణ అండర్–10 విభాగం లాంగ్‌జంప్, 300 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించాడు. సోమవారం స్కూల్ ఆవరణలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

గడువులోగా లక్ష్యాన్ని పూర్తిచేయాలి

రైస్‌మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కల్వకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం రైస్‌మిల్లర్లు గడువులోగా బియ్యం టార్గెట్ పూర్తిచేయాలని మహబూబ్‌నగర్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలియజేశారు. సోమవారం ఉదయం పట్టణ సమీపంలోని సద్గురు రాఘవేంద్ర పారబాయిల్డ్ రైస్ మిల్లులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ కార్యదర్శి చౌహాన్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేశారు. ప్రభుత్వానికి సమర్పించిన రికార్డుల ప్రకారం, మిల్లులో ధాన్యం బస్తాలు ఉన్నాయా లేవా అనే అంశంపై పరిశీలన చేశారు. ధాన్యం బస్తాలను లెక్కవేశారు. అనంతరం పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధాన్యం ప్రకారం సీఎంఆర్ బియ్యం, వేలం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన ప్రభుత్వానికి అప్పగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు ద్రోణాచార్యులు, వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

యాత్రికులకు అటవీశాఖ అధికారుల జరిమానా

మన్ననూర్: రాష్ట్ర అటవీశాఖ, అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధాన్ని జూలై 1 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో మహారాష్ట్రకు చెందిన యాత్రికులు మలమూత్ర విసర్జనకు అటవీ సరిహద్దు ప్రాంతంలో తమ వాహనాన్ని నిలిపారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ బాటిల్‌ను తీసుకొని మల విసర్జన కోసం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ లోని అటవీశాఖ అధికారులు ప్లాస్టిక్‌ను వాడుతుండటాన్ని గమనించి రూ.2,000 జరిమానా విధించారు. మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి దోమలపెంట చెక్‌పోస్టు వరకు దారిపొడవునా ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా అటవీశాఖ సిబ్బంది ప్రయాణికులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్‌ను సేకరిస్తున్నారు. అయినా ఖాతరు చేయకుండా ప్లాస్టిక్‌ను వెంట తీసుకురావడం, అటవీ ప్రాంతంలో నిర్లక్ష్యంగా విసిరేయడం తప్పిదంగా పరిగణిస్తూ జరిమానా విధించి వసూలు చేశామన్నారు. అటవీ పరిసర ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న కారణంగా ప్రయాణికులు, యాత్రికులు, హోటల్ నిర్వాహకులు గమనించాలని అధికారులు తెలియజేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ శాఖల్లో సమస్యల పరిష్కారానికి మొత్తం 68 ఫిర్యాదులు అందాయని, వాటిని పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ కె.సీతారామారావు, సీపీఓ భూపాల్ రెడ్డి, ఏఓ చంద్రశేఖర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఇన్నోవేషన్ ఆవిష్కరణలు వాట్సప్‌లో పంపాలి

స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలు రూపొందించి వాట్సప్ ద్వారా పంపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలియజేశారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో 'ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణ' ప్రచార వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆవిష్కరణ, విద్యార్థుల, వ్యవసాయ రంగ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా తదితర అంశాల ఆవిష్కరణలను రూపొందించి ఆగస్టు మూడో తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని చెప్పారు. ప్రదర్శన ఆవిష్కరణపై రెండు నిమిషాల నిడివి ఉండే వీడియో, ఆవిష్కరణ నాలుగు ఫొటోలు, 100 పదాలతో ఆసక్తి ఉన్న ఔత్సాహికులు 9100678543 నంబర్‌కు వాట్సప్ ద్వారా వృత్తి, ఊరి పేరు, జిల్లా పేరుతో వివరాలను పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈ–డిస్ట్రిక్ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

మరో రెండు కార్పొరేషన్ పదవులు

- శాట్ చైర్మన్‌గా శివసేనారెడ్డి, పోలీస్ హౌసింగ్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి
- తాజాగా జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కొత్తకాపు శివసేనారెడ్డి



గురునాథ్‌రెడ్డి

వనపర్తి: ఉమ్మడి జిల్లాకు మరో రెండు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు దక్కాయి. పార్లమెంట్ ఎన్నికల ముందు మార్చిలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినా.. ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా జీఓ జారీ కాలేదు. చిన్నపాటి మార్పులతో నాటి నామినేటెడ్ పోస్టుల భర్తీ జీఓను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. కాగా.. గతంలో ప్రకటించిన జాబితా ప్రకారం.. పాలమూరుకు మూడు చైర్మన్ పోస్టుల కేటాయించగా.. తాజాగా విడుదలైన జీఓలో కొల్లాపూర్ నుంచి సీజేఆర్‌కు ఇచ్చిన ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని భర్తీ చేయలేదు. అలాగే యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డిని శాట్ చైర్మన్‌గా, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. మూడు నెలల క్రితం కాంగ్రెస్ నాయకులు ఒబేదుల్లా కొత్వాల్‌కు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీంతో ఉమ్మడి జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు దక్కినట్లయింది.

ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలో ప్రజలు అధికంగా విద్యుత్, మురుగు కాల్వలు, చెత్తబండ్ల నిర్వహణపై ఫిర్యాదులు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, కౌన్సిలర్ల సహకారంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ కల్పనాభాస్కర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో విస్తరిస్తున్న సందర్భంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి, తన వద్దకు తీసుకొస్తే.. వాటిని పరిష్కరించేందుకు తాను అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించకుంటే ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే వాటిని పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తూ.. అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జిల్లా మెడికల్ కళాశాల స్థాయిని పెంచేందుకు 300 నుంచి 600కు అనుమతులు ఇచ్చారని, త్వరలో సీఎం పర్యటన సందర్భంగా పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు తీసుకుంటామన్నారు. త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

అరుణాచలంలో గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

నాగర్‌కర్నూల్ క్రైం: తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు, గురుపౌర్ణమి సందర్భంగా, జూలై 21న గిరి ప్రదక్షిణకు నాగర్‌కర్నూల్ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపాలని నిర్ణయించినట్లు డిపో మేనేజర్ దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బస్సు సర్వీస్ కోసం ఆన్‌లైన్ రిజర్వేషన్ నంబర్ 98892ను సంప్రదించాలన్నారు. జూలై 19న రాత్రి 9 గంటలకు నాగర్‌కర్నూల్ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి, ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనం, తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం జూలై 20న రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జూలై 21న సాయంత్రం 4 గంటలకు తిరిగి బస్సు బయలుదేరి నాగర్‌కర్నూల్ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధరను ఒక్కొక్కరికి రూ.3,600గా సంస్థ నిర్ణయించిందని, భక్తులు మరిన్ని వివరాలకు 8309214790, 9440727890 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ముంబైలో వలస కూలీ మృతి


మల్లేష్‌(ఫైల్‌)

నారాయణపేట రూరల్‌: పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లిన ఓ కూలీ మృతిచెందిన సంఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మోనప్ప కాలనీకి చెందిన బూరెల మల్లప్ప కుమారుడు మల్లేష్‌(27) దాదాపు ఎనిమిది సంవత్సరాల కిందట మహారాష్ట్రకు వలస వెళ్లాడు. ముంబైలోని బోరెల్లిలో నివాసం ఉంటూ రోజూ వారీగా దినసర కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం వసాయి ఏరియాలో భవన నిర్మాణ పనుల్లో భాగంగా పరంబా(కట్టెలు) కట్టడం పని చేస్తున్నాడు. దాదాపు 19వ అంతస్తులో ఉండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే రెండేళ్ల కిందట తండ్రి మృతిచెందగా.. తల్లి స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. భార్యతో విభేదాల కారణంగా దూరంగా ఉంటుంది. ఇది ఇలా ఉండగా.. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు బంధువులు ప్రయత్నిస్తుండగా.. అక్కడి నుంచి ఎలాంటి సహకారం అందడంలేదని వాపోతున్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరుతున్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


రాజశేఖర్‌రెడ్డి(ఫైల్‌)

ధరూరు: కడుపునొప్పి, ఆయాసం భరించలేక ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని బూరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బూరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి చిన్న కుమారుడైన రాజశేఖర్‌రెడ్డి(27) ఐదేళ్లుగా కడుపునొప్పి, ఆయాసంతో బాధ పడుతున్నాడు. ఆదివారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలియజేశారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలియజేశారు.

తల్లిని హత్యచేసిన కుమారుడికి పదేళ్ల జైలు శిక్ష

గద్వాల క్రైం: డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించి, మాతృమూర్తిపై కర్కశంగా గొడ్డలితో దాడి చేసి, హత్య చేసిన కుమారుడికి సోమవారం గద్వాల జిల్లా జడ్జి కె.కుష 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన ప్రేమ్‌రాజ్‌ హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ.. అక్కడే ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 2023 ఏప్రిల్‌ 4న ఆర్థిక అవసరాల నిమిత్తం వారి స్వగ్రామంలోని తల్లిదండ్రులు నాగమ్మ, రాముడు వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమారుడైన ప్రేమ్‌రాజ్‌తో ప్రస్తుతం తమ వద్ద డబ్బులు లేవని నచ్చచెప్పారు. ఎట్టి పరిస్థితిలోనైనా.. డబ్బులు ఇవ్వాలంటూ తీవ్ర ఒత్తిడి చేశాడు. దీంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకుంది. వివాదంలో తల్లి నాగమ్మపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటనపై శాంతినగర్‌ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ, సాక్షుల వాంగ్మూలం అనంతరం జిల్లా జడ్జి నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకున్న సిబ్బంది, కోర్టు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్‌ రూరల్‌: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కొల్లాపూర్‌ మండలం సోమశిలలో పీఆర్టీయూటీఎస్‌ 33 జిల్లాల కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11, 12 జీఓలను సవరించి, బీఈడీ అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్‌ ఉపాధ్యాయులకు పీఎస్‌ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. 5,500 పీఎస్‌ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయిస్తామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా బాధ్యులు యూనియన్‌ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ శాసన మండలి సభ్యుడు మోహన్‌రెడ్డి, పూల రవీందర్‌, తిరుమల్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



అవస్థల నడుమ వైద్యవిద్య


మహబూబ్‌నగర్‌ మెడికల్‌ కళాశాల

మెడికల్‌ కళాశాలలో రెగ్యులర్‌ బోధకుల కొరత

- సరిపడా వసతిగృహాలు లేక ఇబ్బందులు
- ఒక్కో గదిలో ఐదుగురు విద్యార్థులు ఉంటున్న వైనం
- నర్సింగ్‌ కళాశాలకు శాశ్వత భవనం లేక ఇక్కట్లు
- కలగా మారిన ఆడిటోరియం నిర్మాణం
- సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు

పాలమూరు: మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ఏర్పాటుచేసి, తొమ్మిదేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో వసతులు సమకూరడం లేదు. నేటికీ బోధన సిబ్బంది కొరత నెలకొంది. ఈ కళాశాల మంజూరైన సమయంలోనే సిద్దిపేట, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్‌ కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఆయా కళాశాలల్లో కొంత మెరుగైన సౌకర్యాలు, అధిక బోధన సిబ్బందిని కేటాయించారు. పాలమూరుపై మాత్రం సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నారు. 2016–17లో 150 సీట్లతో మొదలైన పాలమూరు మెడికల్‌ కళాశాల.. 2019లో ఆర్థిక బలహీన వర్గాల కోటా (ఈడబ్ల్యూస్‌) కింద మరో 25 సీట్లు కేటాయించడంతో 175కు చేరింది. ఇప్పటి వరకు 8 బ్యాచ్‌లు ఉండగా.. త్వరలో కొత్తగా 9వ బ్యాచ్‌ విద్యార్థులు చేరనున్నారు. ప్రస్తుతం కళాశాలలో 825 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా వచ్చే 9 బ్యాచ్‌తో విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరుతుంది. బోధకులు లేకపోతే మెడిసిన్‌ అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్య దక్కదు. దీంతో పరిశోధనల పరంగా, జనరల్‌ ఆస్పత్రిలో వైద్యసేవలకు సమస్యగా మారుతోంది.

22 విభాగాలు..

పాలమూరు మెడికల్‌ కళాశాల ఏర్పాటుచేసి దాదాపు తొమ్మిదేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు కొన్ని విభాగాలకు కనీసం ప్రొఫెసర్ల కేటాయింపు జరగలేదు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పెతాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మాకాలజీ, ఫొరెన్సిక్‌ మెడిసిన్‌, కమ్యూనిటీ మెడిసిన్‌, జనరల్‌ మెడిసిన్‌, పిడియాట్రిక్స్‌, సైకియాట్రీ, డెర్మాటాలజీ, రెస్పీరాటరీ మెడిసిన్‌, జనరల్‌ సర్జరీ, అర్థో, రేడియాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనిక్‌, అనస్తీషియా, ఫిజికల్‌ మెడిసిన్‌ తదితర అత్యవసర మెడిసిన్‌ విభాగాలు ఉన్నాయి. దీంట్లో ప్రధానంగా ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఫల్మనాలజీ విభాగాలలో ప్రొఫెసర్‌ పోస్టులు మొదటి నుంచి ఖాళీగా ఉన్నాయి. కళాశాలలో 22 విభాగాలు ఉన్నా.. సూపర్‌ స్పెషాలిటీ సీట్లు మంజూరు కావడం లేదు. ఇప్పటి వరకు పది విభాగాలకు విడతల వారీగా 30 పీజీ సీట్లు మాత్రమే మంజూరయ్యాయి. సూపర్‌ స్పెషాలిటీ సీట్లు కావాలంటే బోధన సిబ్బంది సంఖ్య ఆధారంగా మంజూరుచేస్తారు. సరైన సిబ్బంది లేకపోవడం వల్ల పది విభాగాలకు కేవలం 30 పీజీ సీట్లు మాత్రమే వచ్చాయి.

రెండు వసతిగృహాలు అవసరం..

మెడికల్‌ కళాశాల ఏర్పాటు సమయంలో 150 మంది విద్యార్థులలో 60 శాతం విద్యార్థులకు సరిపడా ఒక బాలికల వసతిగృహం, మరో బాలుర వసతి గృహం నిర్మించారు. 2024–25 ఏడాదికి సంబంధించి 9వ బ్యాచ్‌ రానుంది. ఈక్రమంలో 825 మంది విద్యార్థుల్లో 60 శాతం అంటే 525 మందికి సరిపడా వసతిగృహాలు ఉండాలి. కానీ ప్రస్తుతం రెండు మాత్రమే ఉండటం వల్ల సమస్యగా మారింది. ఒక్కో గదిలో నలుగురి నుంచి ఐదుగురు ఉంటున్నారు. దీంతో ఖాళీగా ఉన్న నాన్‌ టీచింగ్‌ క్వార్టర్స్‌లలో విద్యార్థులకు వసతి కల్పించారు. ఇక పీజీ విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్‌ కోటా కింద వచ్చే విద్యార్థులకు అదనంగా మరో రెండు వసతిగృహాలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం హాస్టళ్లలో 450 మంది అమ్మాయిలు, 200 మంది అబ్బాయిలు ఉన్నారు.

రూ.7 కోట్లతో ప్రతిపాదనలు..

జిల్లా జనరల్‌ ఆస్పత్రితో పాటు ఆవరణలో సివిల్‌ పనుల కోసం రూ. 4 కోట్లు, ఆస్పత్రిలో ఆపరేషన్‌ థియేటర్లు, వార్డులలో అవసరమైన పరికరాల కోసం రూ. 3 కోట్లతో పాటు రెండు అంబులెన్స్‌లు కావాలని ఆస్పత్రి అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఈ ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనున్నారు. ఇక మెడికల్‌ కళాశాలలో ఒక ఆడిటోరియంతో పాటు బాలికల వసతిగృహం నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించారు. ప్రధానంగా వసతిగృహం ఒక్కో గదిలో ఐదుగురు అమ్మాయిలు ఉంటూ ఇబ్బందులు పడుతున్నట్లు ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

■ రెండేళ్ల క్రితం ప్రభుత్వ నర్సింగ్‌ కళాశాల ప్రారంభించారు. ప్రస్తుతం రెండో బ్యాచ్‌ విద్యార్థులు నర్సింగ్‌ విద్య అభ్యసిస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో 60 మంది, రెండవ బ్యాచ్‌లో 60 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలకు మొత్తం 48 రెగ్యులర్‌ పోస్టులు మంజూరు కాగా.. 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్‌ పోస్టులు 9, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ 11, లెక్చరర్‌ 14, జూనియర్‌ అసిస్టెంట్‌ 2, లైబ్రేరియన్‌ ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఇక ఔట్‌ సోర్సింగ్‌ కింద 28 పోస్టులు ఉంటే, 25 మంది కొనసాగుతున్నారు. నర్సింగ్‌ కళాశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో తరగతుల నిర్వహణ, విద్యార్థుల వసతికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదరి సమీపంలోని 10 ఎకరాల్లో రూ. 40 కోట్లతో నూతన భవనం నిర్మాణంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జనరల్‌ ఆస్పత్రిలో పోస్టుల సంఖ్య ఇలా..

రెగ్యులర్‌ పోస్టుల సంఖ్య	ఉన్న వారి సంఖ్య	ఖాళీలు
63	238	125
మెడికల్‌ కళాశాలలో..		
526	376	150

■ జనరల్‌ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్‌ పోస్టులు 118 ఉండగా.. 110 మంది విధుల్లో కొనసాగుతున్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

■ మెడికల్‌ కళాశాలలో ఔట్‌సోర్సింగ్‌ కింద 78 పోస్టులు ఉండగా.. 69 మంది పనిచేస్తున్నారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

■ కాంట్రాక్ట్‌ పద్ధతి కింద 117 పోస్టులు ఉండగా.. 46 మంది పనిచేస్తున్నారు. మరో 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మెడికల్‌ కళాశాల పోస్టుల వివరాలు..

హోదా	పోస్టులు	రెగ్యులర్‌	కాంట్రాక్ట్‌	ఖాళీలు
డైరెక్టర్‌	1	1	-	-
ప్రొఫెసర్స్‌	22	15	2	5
అసోసియేట్‌ ప్రొఫెసర్స్‌	37	16	5	16
అసిస్టెంట్‌ ప్రొఫెసర్స్‌	60	39	13	8
ట్యూటర్స్‌	32	9	7	16
ఎస్‌ఆర్‌	30	-	2	28
జేఆర్‌	55	-	10	45
ఏడీ	1	1	0	0
ఏఓ	1	1	0	0

వేధిస్తున్న వైద్యుల కొరత..

జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో నిత్యం ఓపీ 1500 నుంచి 2 వేల వరకు కొనసాగుతోంది. ఐపీ కేసులు దాదాపు 600 వరకు ఉంటున్నాయి. జనరల్‌ ఆస్పత్రిలో మొత్తం 750 పడకలు ఉండగా.. శానిటేషన్‌ సిబ్బంది మాత్రం 450 పడకలకు సరిపడా 203 మంది మాత్రమే ఉన్నారు. అవసరమైన శానిటేషన్‌ సిబ్బంది లేకపోవడం వల్ల ఆస్పత్రిలో పరిశుభ్రత అస్తవ్యస్తంగా మారుతోంది. దీనికి తోడు శానిటేషన్‌ నిర్వహించే ఏజెన్సీ నిర్వహణ లోపం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులకు కొత్త రోగాలు వస్తున్నాయి. రోగులను తరలించడానికి కనీసం వీల్‌చైర్స్‌, స్ట్రెచర్స్‌ కూడా లేవు. ప్రధానంగా ఆస్పత్రిలో కార్డియాక్‌ (గుండెకు సంబంధించిన) విభాగం లేకపోవడం వల్ల రోగులు హైదరాబాద్‌వంటి నగరానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాటు యూరాలజీ, న్యూరాలజీ వంటి, న్యూరో విభాగాలు, వైద్యుల కేటాయింపు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల గుండెపోటు, బ్రెయిన్‌ స్ట్రోక్‌ సమస్యలు అధికమైన నేపథ్యంలో ఆయా ప్రధాన విభాగాలు ఆస్పత్రిలో లేవు.



మక్తల్‌లో భారీ చోరీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న నారాయణపేట డీఎస్పీ లింగయ్య

- 66 తులాల బంగారం.. రూ. 50 వేల నగదు అపహరణ
- రైస్‌ మిల్‌ యజమాని ఇంట్లో దొంగతనం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ లింగయ్య

మక్తల్‌: గుర్తుతెలియని వ్యక్తి వంట గది తలుపులు విరగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 66 తులాల బంగారం, రూ.50 వేల నగదు చోరీకి పాల్పడిన సంఘటన మక్తల్‌ పట్టణంలోని, కేరళ స్కూల్‌ వెనుక భాగం, ద్వారకా నగర్‌లో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రైస్‌మిల్‌ యజమాని రాఘవేంద్ర ఇంట్లో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం చేసి బెడ్రూంలో నిద్రించారు. ఇంటి యజమాని రాఘవేందర్‌ రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. అర్ధ రాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తి వంట గది తలుపులు విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలోని దాదాపు 66 తులాల బంగారం ఆభరణాలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లిపోయాడు. ఎప్పటి మాదిరి కుటుంబ సభ్యులు తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో నిద్రలేచి చూడగా.. బీరువాలోని వస్తువులన్ని చెల్లాచెదురయ్యాయి. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి మక్తల్‌ పోలీసులకు సమాచారం అందించారు. మక్తల్‌ సీఐ చంద్రశేఖర్‌, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని, పక్కింటి వారి సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. నారాయణపేట నుంచి క్లూస్‌టీం పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు నారాయణపేట డీఎస్పీ లింగయ్య అక్కడికి చేరుకొని ఇంటి పరిసర ప్రాంతాలను, విరగొట్టిన బీరువాను పరిశీలించారు. ఇంటి యజమానులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై ఇంటి యజమాని రాఘవేందర్‌ మక్తల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలియజేశారు.


ఇంట్లో చెల్లాచెదురుగా పడిన బీరువాలోని వస్తువులు

కౌలు రైతులకు అండగా నిలవాలి


కౌలు రైతుల సర్వే నిర్వహిస్తున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్‌

మదనాపురం: ప్రభుత్వం కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు, రైతు భరోసా అందించి అండగా నిలవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్‌ డిమాండ్‌ చేశారు. మండలంలోని అజ్జకొల్లులో సోమవారం కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్ల సర్వే ప్రకారం 24 లక్షల మంది కౌలు రైతులు 35 లక్షల ఎకరాలు సాగుచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం వచ్చిన కొత్తలో మొదటి రెండేళ్లు కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశారని గుర్తుచేశారు. రుణ అర్హత కార్డులతో భూయజమానుల హక్కులకు ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీ మ్యానిఫెస్టోలో కౌలు దారులకు పంట రుణాలు, పంటల బీమా వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, విష్ణు, వెంకటేష్‌, చెన్నయ్య, మణివర్ధన్‌, మొగిలి, ఆది తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లైన్లుగా జడ్చర్ల–కల్వకుర్తి రోడ్డు


శ్రీరంగనాయకస్వామి ఆలయం కోనేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల–కల్వకుర్తి రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం బాదేపల్లి పెద్ద గుట్టపై శ్రీరంగనాయకస్వామి ఆలయం, కోనేరును పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జెడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహించిన మిడ్జిల్‌ మీదుగా ఉన్న జడ్చర్ల–కల్వకుర్తి రోడ్డును నాలుగు లైన్లుగా మార్చేందుకు ప్రతిపాదిస్తామన్నారు. కొత్తగా ఆరు 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని.. జడ్చర్ల, పెద్దాయపల్లి, కొల్లూరులలో 132 కేవీ సబ్‌స్టేషన్‌లు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులకు త్వరలోనే మంత్రుల చేతులమీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. జడ్చర్ల, బాలానగర్‌లో ట్రామా కేర్‌ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ తదితర కళాశాలలను ఒకే దగ్గర ఏర్పాటు చేస్తామని తెలిపారు.

■ శ్రీరంగనాయకస్వామి ఆలయం కోనేరు పూడ్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో నిందితుడు రవితేజపై చట్టపరమైన చర్యలు చేపట్టారన్నారు. కోనేరు పూడ్చిన దోషులను వదిలేదిలేదని స్పష్టం చేశారు. పట్టణ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కాగా, కొందరు తమ స్వార్థానికి పట్టణ బంద్‌కు పిలుపునివ్వడం తగదన్నారు. దేవాదాయశాఖ భూములు, గాంధీ ట్రస్టు భూములు కాజేసిన సమయంలో ఎందుకు బంద్‌ చేపట్టలేదని ప్రశ్నించారు. నీచ రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. నిందితుడు రవితేజ మేనేజింగ్‌ ట్రస్టీ, అర్చకతత్వానికి సంబంధించి దేవాదాయశాఖ నుంచి 2019లో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉత్తర్వులు ఇప్పించినప్పుడు ఇక్కడి ధార్మిక సంఘాలు, బీఆర్‌ఎస్‌, తదితర పార్టీల నాయకులు నోరు ఎందుకు మెదపలేదని ప్రశ్నించారు. ఆయా ఉత్తర్వులపై విచారిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ శివకుమార్‌, మాజీ ఎంపీపీలు నిత్యానందం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం

జడ్చర్ల: శ్రీరంగనాయకస్వామి ఆలయం కోనేరు ధ్వంసం నేపథ్యంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమపై చేసిన ఆరోపణలు అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. దేవాదాయశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను ఏమార్చి విలేకరుల సమావేశంలో వివరించారని అన్నారు. కోనేరు ధ్వంసం కేసులో నిందితుడిగా ఉన్న రవితేజగౌడ్‌కు తాము సహకరించినట్లు పేర్కొనడం తగదన్నారు. రవితేజగౌడ్‌ స్వయంగా తనను ఆలయ ట్రస్టీ, అర్చకుడిగా పేర్కొంటూ గుర్తింపు ఇవ్వాల్సిందిగా చేసుకున్న దరఖాస్తుపై సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. ఈమేరకు తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. ఇలాంటి చర్యలు తగవన్నారు. ఆరోపణలు చేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి వాస్తవాలను నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు. తాము రవితేజగౌడ్‌ను ఎంతమాత్రం ఎప్పుడు సిఫారసు చేయలేదని తెలిపారు. అలాంటి వ్యక్తిని కాంగ్రెస్‌ పార్టీలో చేర్చుకున్నారని విమర్శించారు.

జడ్చర్లలో బంద్‌ ప్రశాంతం


జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంఘాల నాయకులు

జడ్చర్ల: బాదేపల్లి పెద్దగుట్టపై శ్రీరంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరును పూడ్చివేసిన ఘటనను నిరసిస్తూ సోమవారం హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన పట్టణ బంద్‌ ప్రశాంతంగా ముగిసింది. పాతబజార్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు కాషాయ కండువాలు ధరించి నినాదాలు చేస్తూ ర్యాలీని ప్రారంభించారు. గాంధీ, అంబేద్కర్‌ చౌరస్తాల మీదుగా సిగ్నల్‌గడ్డ, నేతాజీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. వ్యాపార, వాణిజ్య కేంద్రాలతోపాటు విద్యాసంస్థలను సైతం మూసివేశారు. స్థానిక నేతాజీ చౌరస్తాలో కొద్దిసేపు రాస్తారోకో చేపట్టారు. కోనేరును పూడ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు అశోక్‌బాబు, చంద్రమోహన్‌ పోలీస్‌ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని వైన్‌ షాపులో గత నెల 6వ తేదీన ఆటో డ్రైవర్‌పై ఒక వ్యక్తి దాడి చేసిన ఘటనలో సోమవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూల్‌ పట్టణం, అశోక్‌ నగర్‌కు చెందిన ఎరుకలి కృష్ణ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న ఆటో అద్దెకు తీసుకొని ఆది, వంశీ, బన్నీలు పుల్లూరు శివారులోని వైన్‌ షాపుకు వచ్చారు. వైన్‌షాపులో ఇంకో ఇద్దరు మురళి, ధర్మ ఉన్నారు. ఆ ముగ్గురికి, ఈ ఇద్దరికి మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. ఆపడానికి వెళ్లిన ఆటో డ్రైవర్‌ కృష్ణపై ధర్మ అనే వ్యక్తి బీరు సీసాతో దాడి చేశాడు. అతని ఆటోలో వచ్చిన ముగ్గురు, దాడి చేసిన ధర్మ పరార్‌ కావడంతో మురళి కృష్ణను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. సోమవారం కృష్ణ తల్లి ఎరుకలి శాంతమ్మ ఫిర్యాదు మేరకు ధర్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫ్రిజ్‌ పేలి ఆస్తినష్టం

- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


ధ్వంసమైన ఫ్రిజ్‌ ఇలా..

తెలకపల్లి: మండల కేంద్రంలోని బోడశీను ఇంట్లో ఫ్రిజ్‌ పేలి ఆస్తినష్టం వాటిల్లింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి యజమాని బోడ శీను ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఫంక్షన్‌కు వెళ్లారు. తాళం వేసిన ఇంట్లో నుంచి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా పొగ, మంటలు వచ్చాయి. చట్టు పక్కలవారు గమనించి ఇంటి యజమాని శీనుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే వారికి ఇంటి బయట కరెంట్‌కు సంబంధించిన మేన్‌ ఉంటుందని, బంద్‌ చేయాలని తెలియజేశాడు. దీంతో కరంట్‌ను బంద్‌ చేశారు. తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా.. ప్రమాదవశాత్తు ఫ్రిజ్‌ పేలిపోయింది. ఆ పొగలకు ఇంట్లోని వస్తువులు, ఫర్నీచర్‌, ఇంటి గోడలు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా పొగతో మసకబారింది. అదే రోజు రాత్రి ఒంటి గంటకు ఇంటి యజమాని వచ్చి పరిశీలించాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, దాదాపు రూ.4 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలియజేశాడు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం, కర్నూల్‌ జిల్లా పెద్దటేకుర్‌ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్‌ కరుణ, రమేష్‌లు వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మండలానికి జొన్నలు అమ్మడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి–44పై వస్తుండగా, జల్లాపురం శివారు ప్రాంతంలో ఆటోబోల్తా పడింది. రమేష్‌కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ రమణకు గాయాలు కాలేదు. రమేష్‌ను హైవే అంబులెన్స్‌లో కర్నూల్‌ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

‘ఉచిత’ నాటకం!

ఏపీలో ఇసుక పేరుకే ఫ్రీ.. డబ్బులు సమర్పించుకోవాల్సిందే ● కూటమి సర్కారు తాత్కాలిక కొత్త విధానం తీరు ఇదీ..

- పన్నుల మోత, రవాణా చార్జీలు, నిర్వహణ ఫీజులు తడిసిమోపెడు
- ఇసుక కమిటీలపై పెత్తనమంతా పచ్చ నేతలదే
- రవాణా ముసుగులో తరలించి సొమ్ము చేసుకునే యత్నాలు
- దాదాపు 40 లక్షల టన్నులు గత 40 రోజుల్లో మాయం
- స్టాక్ పాయింట్ల వద్ద సగం నిల్వలను కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- వర్షాకాల అవసరాల కోసం నిల్వ చేసిన గత ప్రభుత్వం
- జగన్ హయాంలో ఏటా ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం



విశాఖ జిల్లా అగనంపూడి వద్ద ఉచితంగా ఇసుక.. కానీ టన్ను ధర రూ.1,394గా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని టీడీపీ సర్కారు చెబుతున్న మాటలు మాయ నాటకాలని తేలిపోయింది! ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించినా స్టాక్ యార్డుల వద్ద మాత్రం ధరల పట్టికలు పెట్టడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత ఇసుక హామీకి స్టాక్ యార్డుల వద్ద పెట్టిన ధరల పట్టికలతో సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారు. వర్షాకాలంలో కొరత లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఉంచింది. తాజాగా టీడీపీ సర్కారు దీన్ని ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పినా అన్నిచోట్లా టన్నుకి నిర్దేశిత ధర చెల్లించాలని తేల్చి చెప్పడంతో ఇసుక కోసం వచ్చిన వారు కంగు తిన్నారు. చీరాల సమీపంలోని వేటపాలెం స్టాక్‌యార్డులో టన్ను ఇసుక రూ.675గా బోర్డు పెట్టారు. దీంతో ఉచితంగా ఇసుక తీసుకెళదామని ట్రాక్టర్లతో వచ్చిన పలువురు మోసపోయామని గ్రహించి వెనుతిరిగారు. అన్ని స్టాక్ యార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఎలాంటి మేలు చేయని.. ఖజానాకు ఆదాయం సమకూరని తాత్కాలిక కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చింది. దీనివల్ల అటు ప్రజలు, ఇటు ఖజానాకు నష్టం వాటిల్లుతుండగా టీడీపీ నేతలు మాత్రం జేబులు నింపుకునేందుకు మార్గం సుగమం అయింది. పేరుకు ఉచిత ఇసుక అని ప్రకటించినా ప్రజలు మాత్రం డబ్బులు కట్టాల్సిందే. ఇదే ఉచిత ఇసుక విధానంలోని ప్రత్యేకత. ఉచిత ఇసుక విధానం పేరుతో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సోమవారం జీవో ఎంఎస్ నెంబర్ 43 జారీ చేశారు. గత సర్కారు హయాంలో అమలైన విధానం స్థానంలో తాత్కాలికంగా ఉచిత విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఇసుక విక్రయాల ద్వారా ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం సమకూరగా ప్రజలకు సులభంగా, అందుబాటు ధరలో లభ్యమయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఖజానాకు ఒక్క రూపాయి ఆదాయం రాదు. మరోవైపు ప్రజలు డబ్బులిచ్చి మరీ ఉచిత ఇసుకను కొనుగోలు చేయాల్సిన అగత్యం దాపురించింది!

ఇదీ కొత్త విధానం..

జిల్లా స్థాయిలో కమిటీలు ఆయా రీచ్‌ల్లో ఇసుక ధరలను నిర్ణయిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఎస్పీ, జేసీ, ఆర్డీఓ తదితర అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటైన ఇసుక కమిటీలు తమ పరిధిలోని ఇసుక స్టాక్ యార్డులను స్వాధీనంలోకి తీసుకుని ధరలు నిర్ణయించాయి. సీనరేజి ఫీజు, ఇతర పన్నులు, తవ్వకం, లోడింగ్, రవాణా, ర్యాంపు నిర్వహణ, పరిపాలనాపరమైన ఖర్చులన్నీ లెక్కించి టన్ను ఇసుక ధరను నిర్ణయించారు. యార్డులకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లేదా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఇన్‌ఛార్జిలుగా నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారులు స్టాక్ పాయింట్ల వద్ద నేరుగా ఇసుక కొనుగోలు చేయవచ్చని, తరలించేందుకు వారే లారీలు తెచ్చుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్లలో నగదు లావాదేవీలు కాకుండా డిజిటల్‌గా మాత్రమే డబ్బులు స్వీకరించే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో ఇసుక కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో పర్మిట్లు జారీ చేసే విధానం రూపొందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇసుక ఆపరేషన్స్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర స్థాయిలో మైనింగ్ డైరెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తామని తెలిపారు. ఒక వ్యక్తి ఒక రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఇస్తామన్నారు.

ఉసూరుమంటూ..

ఉచితంగా ఇసుక దొరుకుతుందని భావించిన నిర్మాణదారులు ఉదయాన్నే ట్రాక్టర్లలో స్టాక్ పాయింట్ల వద్దకు వచ్చి బారులు తీరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డులు చూసి విస్తుపోయారు. ఉచితంగా ఇసుక అందిస్తామని ఊరించి టన్నుల లెక్కన డబ్బులు కట్టాలని బోర్డులు ఏర్పాటు చేయటాన్ని చూసి ఉసూరుమంటూ వెళ్లిపోయారు. కొత్త ఇసుక విధానంలో బాపట్ల జిల్లా చీరాలలో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.3,034 అవుతుంది. ఒక్కో ట్రాక్టర్‌లో 4.50 టన్నులు లోడింగ్ చేయవచ్చు. దీనికి రవాణా ఛార్జీలు మరో రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా ట్రక్కు ఇసుక రూ.4 వేలు సమర్పించుకుని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరిగి వెళ్లిపోతున్న వినియోగదారులు..

స్టాక్ పాయింట్ల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీతో రాష్ట్ర ప్రజలందరికి ఉచితంగా ఇసుక అని పేర్కొంటూ షరతులు వర్తిస్తాయి అనే మాదిరిగా టన్ను ఇసుక రూ.675 అని బోర్డులు పెట్టారు. అక్కడకు వచ్చిన వారంతా బోర్డులు చూసి ఈ ధరలకు కొనలేమని తిరిగి వెళ్లిపోతున్నారు. వేటపాలెం స్టాక్ పాయింట్‌కి మధ్యాహ్నం వరకు 20 ట్రాక్టర్లు రాగా అన్నీ ఖాళీగా తిరిగి వెళ్లిపోయాయి. ఒక్కరూ ఇసుక కొనుగోలు చేయలేదు. టీవీలు, పేపర్లలో ఇసుక ఉచితమన్న వార్తలు చూసి వచ్చామని.. కానీ ఇక్కడకు వచ్చాక తాము మోసపోయామని గుర్తించినట్లు పలువురు కొనుగోలుదారులు పేర్కొన్నారు.

సగం ‘స్టాక్’స్వాహా

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్లను తమ అధీనంలోకి తెచ్చుకున్న టీడీపీ నేతలు ఇష్టానుసారం విక్రయించేశారు. వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నుల వరకూ ఇసుకను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచింది. గత నెల 4వ తేదీ నుంచి అధికారం అండతో టీడీపీ నేతలు ఇసుక యార్డులను దౌర్జన్యంగా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులను బెదిరించి తరిమేశారు. ఇప్పటికే చాలా వరకూ ఇసుకను అమ్మేశారు. సుమారు 40 లక్షల టన్నుల ఇసుకను విక్రయించేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 40 లక్షల టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ యార్డుల్లో ఉందని గనుల శాఖ చెబుతోంది. అంటే మిగిలిన 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు నెలరోజుల్లోనే మింగేసినట్లు స్పష్టమవుతోంది.

రవాణా ముసుగులో దోపిడీకి స్కెచ్!

ఇసుకపై కొత్త విధానంలో ఉచితం అనేది ఒక మాయ కాగా రవాణా అనేది మరో సరికొత్త దోపిడీకి స్కెచ్‌గా కనిపిస్తోంది. రవాణా ముసుగులో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇసుకను తామే రవాణా చేస్తామనడం వెనుక ఉద్దేశం అదేనని భావిస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరతను అధిగమించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన ఇసుకను అధికారం మారగానే కూటమి సర్కారు మాయం చేసింది. దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను గత 40 రోజుల్లో లెక్కాపత్రం లేకుండా ఎక్కడికక్కడ టీడీపీ నేతలు అమ్మేసుకున్నారు. అదే తరహాలో రవాణా పేరుతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొత్త విధానానికి రూపకల్పన చేశారు. పేరుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని ఇసుక కమిటీలు అమ్మకాలను పర్యవేక్షిస్తాయని చెబుతున్నా స్థానిక టీడీపీ నేతలే ఇసుక వ్యవహారాలను నియంత్రించే పరిస్థితి నెలకొంది. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు హల్‌చల్ చేయడమే ఇందుకు ఉదాహరణ. ఉచితంగా ఇసుకను అందిస్తున్నామంటూ బ్యానర్లతో స్టాక్ పాయింట్ల వద్ద ర్యాలీలు నిర్వహిస్తూ హడావుడి చేశారు. దీన్నిబట్టి స్టాక్ యార్డులు ఎవరి చేతుల్లో ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పటివరకు జిల్లా ఇసుక కమిటీలు స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో ఇన్‌చార్జీలను కూడా నియమించలేదు. యార్డుల్లో ఎంత ఇసుక ఉందో కచ్చితమైన సమాచారం అధికారుల వద్ద లేదు. వర్షాకాలం సీజన్ వరకు ఉచిత ఇసుక పేరుతో దోపిడీని కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయి విధానాన్ని తెచ్చే యోచనలో సర్కారు ఉన్నట్లు స్పష్టమవుతోంది


వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలో మాతృమూర్తి, సతీమణితో కలసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనలు

కష్టాలు కొద్దికాలమే... దేవుడి దయతో ధైర్యంగా ఎదిరిద్దాం

75వ జయంతి వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు

సాక్షి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయకు జనవాహిని పోటెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన అభిమానులు వైఎస్సార్ ఘాట్ వద్ద ఘన నివాళులర్పించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, మేనత్త వైఎస్ విమలమ్మ, చిన్నాన్న వైఎస్ సుధీకర్‌రెడ్డి, అత్తమ్మ ఈసీ సుగుణమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. సమాధి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్ జగన్ కాసేపు అక్కడే మోకాళ్లపై కూర్చొని తండ్రిని స్మరించుకున్నారు. నివాళులర్పించే సమయంలో వైఎస్ విజయమ్మ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

ప్రత్యేక ప్రార్థనలు..

సమాధి ఘాట్ వద్ద వైఎస్ జగన్, వైఎస్సార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రానున్న కాలంలో కొన్ని సమస్యలు ఎదురైనా రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో జగన్ ధైర్యంగా ఎదుర్కొనేలా దేవుడు ఆశీర్వదించాలని మేనత్త విమలమ్మ ప్రార్థన చేశారు. కష్టాలు తాత్కాలికమేనని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా దేవుడి మీద భారం వేసి ముందుకు వెళ్లడం ద్వారా ఎదిరించే శక్తిని ప్రసాదిస్తాడని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైఎస్సార్, వైఎస్ జగన్ చేసిన మంచిని ప్రస్తావించారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు..

ఇడుపులపాయలోని ఘాట్ ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు అక్కడే నిలబడి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతిరెడ్డి, విమలమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అందరికీ అభివాదం.. అభిమానులతో సెల్ఫీ

ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి తరలి వచ్చిన జనవాహినికి వైఎస్ జగన్ అభివాదం చేశారు. వైఎస్సార్ అమర్‌రహే, వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ఘాట్ ప్రాంగణం హోరెత్తింది. పలువురి వద్దకు స్వయంగా వెళ్లి పలుకరించిన వైఎస్ జగన్ అడిగిన వారందరితో సెల్ఫీ దిగారు. భారీగా వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని అనంతరం అక్కడి నుంచి ఉదయం 11.10 గంటలకు గన్నవరం చేరుకున్న వైఎస్ జగన్‌కు విమానాశ్రయంలో పలువురు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. వారందరినీ ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్ రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరారు.

నాన్నా.. మీ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు

- కోట్లాది కుటుంబాలు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి
- తండ్రి వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తన తండ్రి వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ సోమవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. ‘నాన్నా మీ 75వ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు. కోట్లాది కుటుంబాలు ఇవాళ మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మీ పుట్టిన రోజున సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు చూపిన మార్గం మాకు శిరోధార్యం. జీవితాంతం మీరు పాటించిన క్రమశిక్షణ, చేసిన కఠోర శ్రమ, రాజకీయాల్లో మీరు చూపిన ధైర్యసాహసాలు మాకు మార్గం. మీ ఆశయాల సాధనే లక్ష్యంగా, కోట్లాది కుటుంబాల క్షేమమే ధ్యేయంగా చివరి వరకూ మా కృషి కొనసాగుతుంది’అంటూ వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

జూరాలకు మరింత పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాల ఆధారంగా వస్తున్న ఇన్‌ఫ్లోలు సోమవారం మరింత పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 132 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 132 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 7.701 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగ కొనసాగుతుంది. జూరాల సమాంతర కాల్వ, ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలపివేశారు. సోమవారం నాటికి పూర్తి నీటి మట్టం 1,020 అడుగులకు చేరింది. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

వైఎస్సార్ ఉంటే దేశస్థాయిలో ఎదిగేవారు


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

- రాజీవ్‌గాంధీ, వైఎస్సార్ లేకపోవడంతో రాజకీయంగా నష్టపోయా
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలు

వనపర్తిటౌన్: 2004, 2009 ఎన్నికల్లో వైఎస్సార్‌ను చూసి కాంగ్రెస్‌కు ఓటేసినట్లే 2023లో రేవంత్‌రెడ్డిని చూసి హస్తం పార్టీని గెలిపించారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ధృడమవుతుందని.. కేటీఆర్, హరీశ్‌రావు ఏం చేసినా బీఆర్ఎస్ ఉండదని.. భవిష్యత్‌లో బీజేపీతోనే కాంగ్రెస్‌కు పోటీ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ బతికి ఉంటే ఇప్పటికీ కాంగ్రెస్ అధికారంలోనే ఉండేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. కానీ, వైఎస్సార్ మాత్రం రాష్ట్రంతో పాటు దేశంలో అత్యున్నత పదవులు అధిరోహించేవారని అభిప్రాయపడ్డారు. పాలమూరు కరువుతో తాగునీటికి అల్లాడుతుంటే రూ.7వేల కోట్లతో ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు ప్రారంభించారని, వైఎస్సార్ భిక్షతోనే పాలమూరు పచ్చబడిందన్నారు. వైఎస్సార్ చనిపోయాకే కేసీఆర్ ధైర్యం చేసి ముందుకొచ్చారని.. వైఎస్సార్ ఉన్నప్పుడు కుక్కిన పేనులా ఉండేవారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ నాయకత్వంలో పనిచేసే ఏ నాయకుడు తప్పు చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ నిందారోపణలను తనపై వేసుకునే అరుదైన రాజకీయ నాయకుడు అని కొనియాడారు. బాగా పరిచయం ఉండి అన్ని అంశాలను గమనించిన రాజీవ్‌గాంధీ, అన్నీ విషయాలు తెలిసి అవగాహన ఉన్న వైఎస్సార్ ఇద్దరూ చనిపోవడం రాజకీయంగా, వ్యక్తిగతంగా తనకు తీరని నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి కోసం తెలంగాణకు చిన్నారెడ్డి ద్రోహం చేశాడనే నింద రావొద్దని.. 2004 ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే వైఎస్సార్ పిలిచినా దూరంగా ఉండటం వల్లే ఆలస్యంగా మంత్రి పదవి వచ్చిందన్నారు. వైఎస్ ముందు మాట్లాడేందుకు భయపడేవారని, ఆయన మనసు మాత్రం వెన్నలాంటిదని చెప్పారు. వైఎస్సార్‌తో కలిసి పనిచేయడం పూర్వజన్మ పుణ్యఫలమని పేర్కొన్నారు. వైఎస్సార్ నాయకత్వ లక్షణాలను తెలుగు రాష్ట్రాల్లో నాయకులు అందిపుచ్చుకుంటే ప్రజల చేత మన్ననలు పొందుతారని అభిప్రాయపడ్డారు. అనంతరం వనపర్తి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రతివార్డు తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు కె.రాములు, సయ్యద్ అక్తర్, ఖమ్మర్ మియా, పరుశురాం, జనార్దన్, యాదయ్య, కిరణ్‌కుమార్, బాబా, కుమార్, వీణాచారి, అబ్దుల్లా, శేఖర్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలి


పస్పుల వద్ద కేజీబీవీని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

మరికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, విద్యను సద్వినియోగం చేసుకుని బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం మరికల్ మండలం పస్పుల వద్ద నిర్మించిన కస్తుర్బా గాంధీ నూతన పాఠశాలను ప్రారంభించారు. బాలికల విద్య అభివృద్ధి కోసం తాము ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. మహిళా ప్రజాప్రతినిధులను, అధికారులను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. తర్వలోనే ఇక్కడ ఇంటర్ విద్యను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. మరో మూడు రోజుల్లో ధన్వాడ నుంచి పస్పులకు పాఠశాలను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, కస్తుర్బా జిల్లా అధికారి పద్మనళిని, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై అత్తాకోడలు..

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి వరుసకు అత్తాకోడళ్లు. కాగా వారు ఇరువురు తమతమ పార్టీల తరుపున ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మొట్టమొదటి సారిగా అధికారికంగా సోమవారం ఒకే వేదికపై కలిశారు. మరికల్ మండలం పస్పుల వద్ద కేజీబీవీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ కలిసి పాఠశాలను ప్రారంభించారు. బాలికలకు వివిధ సూచనలు చేశారు.

భయం.. భయంగా విధులు

పెచ్చులూడుతున్న రేవల్లి ఆస్పత్రి భవనం

గోపాల్‌పేట: రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం పెచ్చులూడుతోంది. ఎప్పుడు ఎవరిపై కూలుతుందోనని ప్రజలతో పాటు ఆస్పత్రి సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా సీహెచ్‌సీ హాల్లో స్లాబ్ పెచ్చులూడి కింద పడింది. అక్కడ రోగులు, ఆస్పత్రి సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొన్నిరోజులుగా ఎప్పుడు ఎక్కడ పెచ్చులు ఊడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వైభవంగా శ్రీలక్ష్మీగణపతి హోమాలు

- శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనారసింహా స్వామి కల్యాణ మహోత్సవం
- లోక కల్యాణార్థమై వేదయుక్తంగా హోమాలు
- శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ఈ నెల 7 నుంచి 21 వరకు శ్రీకృష్ణ కాలచక్ర అయుత చండీ, అతిరుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక 83వ విశ్వ శాంతి మహాయాగ మహోత్సవం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు సోమవారం యాగశాల ప్రదక్షిణ గోపూజ గణపతి పూజ, యాగశాలలో మండప ఆరాధనలు అర్చనలు నిర్వహించారు. లోక కల్యానార్థం ఈ ప్రాంత వాసులకు సంకట విమోచన, ఐశ్వర్య ప్రాప్తికి సామూహికంగా శ్రీలక్ష్మి గణపతి హోమాలు, వేదమూర్తులైన బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వశత్రు వినాశనం, అరిష్టాలు ఇతి బాధలు తొలగేందుకు శ్రీలక్ష్మి నారసింహ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణ కృతువులో మహాసంకల్పం, రక్షాధారణ యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, జీలకర బెల్లం సుముహూర్తం, మాంగల్య ధారణ, బ్రహ్మముడి, తలంబ్రాలు, స్వామి అమ్మవార్లకు ఒడిబియ్యం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. సామూహికంగా గణపతిపూజ, శ్రీ గణపతి హోమాలు చేయించారు. భక్తులు స్వామివారి అనుగ్రహం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 9న మంగళవారం వివాహం, సంతానం కాని ఆడ, మగ వారికి పాశుపత అస్త్ర హోమాలు, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం ఆంజనేయ స్వామికి విశేష పూజలు, అభయాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, సింధూరార్చన కార్యక్రమం సామూహికంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలియజేశారు. భక్తులు ఇంటి నుంచి సింధూరం, తమలపాకులు మంగళవారం తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.


కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ


హోమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం


స్వామివారి రథోత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీకంచికామకోటి పీఠం పాలమూరు శాఖ 32వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుదర్శన హోమం, మధ్యాహ్నం పూర్ణాహుతి పూజలు చేశారు. పురవీధుల గుండా స్వామివారి రథోత్సవ ఊరేగింపు కొనసాగింది. రథోత్సవంలో భజన మండలి కీర్తనలు, మహిళా బృందాల కోలాటాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్ శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, గుండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.